క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



మరిడమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శనివారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాలతో వైభవంగా హోమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

సామర్లకోట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు పిలుపునిచ్చారు. శనివారం నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై గురువారం ఇంటింటా నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు వార్డులోని ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సమాచారం సేకరించారు.

సవరించిన వేతనాలు డిస్కంకూ అమలు చేయాలి



వీసం వీరనాగు

సామర్లకోట: ఔట్ సోర్సింగ్ సిబ్బంది విషయంలో అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఏపీ ఈపీ డీసీఎల్–డిస్కం కార్మిక సంఘ ఉమ్మడి జిల్లా చైర్మన్ వీసం వీరనాగు అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1500 మంది ఈపీడీసీఎల్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని, కార్మికుల వేతనాల సవరణకు యాజమాన్యం, కార్మిక సంఘ నాయకులతో చర్చించి ఆగస్టు 14న వేతనాలను సవరిస్తున్నట్టు ప్రకటించి డిస్కం కార్మికులకు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి ఆమోదం లభించినా అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

30న కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు కమిషనర్ జె.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి 23 అంశాలతో అజెండాను తయారు చేసి సభ్యుల ఆమోదం కోసం చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

ఘనంగా సాయిబాబా జన్మదిన వేడుకలు



సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గురువారం సాయిబాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. ఆలయం పరిసరాలు సాయిబాబా నామంతో మార్మోగాయి. పలువురు భక్తులు సాయిసత్య వ్రతంలో పాల్గొని ప్రత్యేక దీపాలంకరణ సేవ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తాటాకిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటాకిల్లు

కొత్తపల్లి: మండలంలోని శ్రీరాంపురంలో గురువారం తాటాకిల్లు దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గణపతి ఉత్సవాల సందర్భంగా వేసిన తారాజువ్వ ప్రమాదవశాత్తూ అమజాలపు పోలయ్యకు చెందిన తాటాకిల్లుపై పడి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలను అదుపు చేసినా ఫలితం లేదు. గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బోట్‌క్లబ్: ఇంద్రపాలెం విద్యుత్ ఉపకేంద్రం వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ జి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

గణపయ్యా.. వెళ్లి రావయ్యా..

- ఘనంగా గణేశ్ నిమజ్జనాలు
- సందడిగా మారిన సాగరతీరం
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు ముగియడంతో గ్రామాల్లో గణేశ్ నిమజ్జనాల సందడి నెలకొంది. ఉప్పాడ, కోనపాపపేట సాగరతీరంలో గురువారం సుమారు 200లకు పైగా గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనోత్సవంతో సాగరతీరం కళకళలాడింది. మండలంలో కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణాసంచా కాల్పుల నడుమ వినాయక విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. కొత్తపల్లితో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా తీసుకొచ్చి ఉప్పాడ వద్ద సముద్రంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులను ఇచ్చి పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. పర్యాటకుల తాకిడితో బీచ్‌రోడ్డు కిక్కిరిసిపోయింది. ఉపాడ నంచి కాకినాడ వరకూ తీరం వెంబడి సందడి నెలకొంది.

అన్న సమారాధనలు

వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గురవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు. వాకతిప్ప, ఉప్పాడ, సుబ్బంపేట, అనంతలక్ష్మీకాలనీ, కొండెవరం గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో పెండ్లి విందును తలపించేలా పలు రకాల వంటలతో భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

గణపతి లడ్డూలకు వేలంపాట

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా గ్రామాల్లోని వినాయక మండలాల వద్ద స్వామివారి లడ్డూలకు గురువారం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేలంపాటలు నిర్వహించారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన లక్ష్మీగణపతి మందిరం వద్ద లడ్డూను చింతపూడి వెంకటరమణ రూ.11,116కు, పొన్నాడ శివారు కోనపాపపేటలో గణపతి లడ్డూను ఉమ్మిడి చిన్న రూ.60 వేలకు దక్కించుకున్నారు.



గణపతి నిమజ్జనంలో నృత్యాలు చేస్తున్న యువకులు



ఉప్పాడ సముద్రంలో గణపతిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

గంగమ్మ ఒడికి గణపతి

- ఉత్సాహంగా నిమజ్జనాలు
- పర్యవేక్షించిన అధికారులు

సామర్లకోట: నవరాత్రుల్లో పూజలందుకున్న గణనాథుడు గురువారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. స్థానిక గోదావరి కాలువలో మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసుశాఖల త్రిసభ్య కమిటీ సభ్యులతో భద్రత ఏర్పాట్ల నడుమ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన విగ్రహాలతో పాటు మున్సిపాలిటీ, జి.రాగంపేట ప్రాంతాల నుంచి విగ్రహాలు బాణసంచా కాల్పులు, డ్యాన్సులు, బ్యాండ్ మేళాల నడుమ పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర ఆలయ ముఖద్వారం వద్ద ఉన్న గోదావరి కాలువ రేవుకు చేరుకున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పచ్చళ్ల కంపెనీ యజమాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరు అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తూ దారి పొడవునా ప్రసాదాలు పంచారు. సీఐ కె.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో, ఎస్సై పీవీఆర్ మూర్తి, ఏఎస్సైలు రత్నం, సింహాద్రి, సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఐదు అడుగులు దాటి ఉన్న విగ్రహాలను క్రేన్ సహాయంలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం చేసిన విగ్రహాలను మధ్యలోకి తీసుకువెళ్లేందుకు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. పీబీ దేవం, జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం, వీకే రాయపురం, బోయనపూడి, మాధవపట్నం గ్రామాల నుంచి వచ్చే విగ్రహాల నిర్వాహకులు ఆయా గ్రామాల పరిధిలో ఉన్న గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు. అచ్చంపేట, గొంచాల, నవర, చంద్రంపాలెం గ్రామాల వారు ఏలేరు కాలువతో పాటు పీబీసీలో నిమజ్జనం చేశారు. గురువారం గోదావరి కాలువలో 53 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

15 కేజీల లడ్డు రూ.10,100

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో పండ్ల వర్తకులు ఏర్పాటు చేసిన గణపతి శిబిరం వద్ద 15 కిలోల లడ్డూకు గురువారం వేలం పాట నిర్వహించారు. బొబ్బా సతీష్ అనే భక్తుడు దానిని రూ.10100కు దక్కించుకున్నారు. కాగా శ్రీవరసిద్ధి వినాయక తోపుడు బండ్ల వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న శనివారం అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రసన్నాంజనేయనగర్‌లో భారీ అన్నదానం

సామర్లకోట: స్థానిక ప్రసన్నాంజనేయనగర్‌లో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేయగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్ని ప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు బిక్కిన సుబ్బారావు, రామ కృష్ణ, లక్ష్మీచక్రరావు, కామేశ్వరరావు, యాళ్ల శ్రీనివాసు, గంగరాజు, సీహెచ్ సుజాత, ఇతర మహిళా సభ్యులు భక్తులకు సేవలందించి అనంతరం దవులూరి దొరబాబును సత్కరించారు.



సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేయిస్తున్న అధికారులు



లడ్డును పాటదారునికి అందజేసిన నిర్వాహకులు



కొత్తపల్లిలో లడ్డూను దక్కించుకున్న వెంకటమరణ



గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న మహిళలు



సామర్లకోట ప్రసన్నాంజనేయనగర్‌లో అన్నదానం



ఉప్పాడ బీచ్‌రోడ్డులో నిమజ్జనం కోసం తరలిస్తున్న గణపతి విగ్రహం



సుబ్బంపేటలో అన్నదానం

భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం

పెద్దాపురం: స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, పీఎస్ఎం కార్యదర్శి రొంగల వీర్రాజు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం స్థానిక నువ్వులగుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆయన జయంతి సభ నిర్వహించారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గొర్లి రమేష్, చిన్న, కూనిరెడ్డి రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ తదితరులు

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేల విరాళం

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం రూ.50 వేల విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురానికి చెందిన వైజానకి వల్లభరావు, వెంకయ్యమ్మ ఈ విరాళం అందజేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఈఓకు విరాళం అందజేస్తున్న భక్తులు

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. నిరాశ్రయులైన బాధితులు దమ్ము అప్పలనర్స, బడే బేబీ కుటుంబాలను గురువారం జనసేన పార్టీ నాయకులు పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, కంబాల దాసు, పిల్లా శ్రీధర్, తెలగంశెట్టి వెంకటేశ్వరావు, పల్లేటి బాపన్న దొర తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గోకవరం: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జగదీష్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా గురువారం గోకవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. మండలంలోని పరిస్థితులపై పోలీసులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో బ్లేడ్ బ్యాచ్‌లు, గంజాయి స్మగ్లింగ్, సారా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైన పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 300 మందిని బైండోవర్ చేశామన్నారు. రాత్రి సమయాల్లో నేరాలు అధికంగా జరిగే ప్రదేశాలపై నిఘా పెట్టామన్నారు. గోకవరం కేంద్రంగా తరచూ దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆయన వెంట సీఐ ఉమామహేశ్వరావు, ఎస్సై శివనాగబాబు తదితరులు ఉన్నారు.



గోకవరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ జగదీష్

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



ప్రవక్త జన్మదిన వేడుకలో ముస్లింలతో దొరబాబు

పెద్దాపురం: మిలాద్ ఉన్ నబీ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. గురువారం వారంతా స్థానిక కబడ్డీ వీధి మసీద్ నుంచి ప్రదర్శన చేశారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ కరీమ్ (జానీ) ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ ప్రవక్త బోధనాను సారం నడుచుకోవాలన్నారు. తొలుత మసీద్ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి మసీద్ వద్ద కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, మక్బుల్‌జానీ, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

జాషువా కవితలు అందరికీ ఆదర్శం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: కవి గుర్రం జాషువా కవితలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం జాషువా జయంతి నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు సాహిత్యానికి జాషువా సేవలు ఎనలేనివన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్ తదితరులతో కలసి ఆయన జాషువాకు నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, గుర్రాల యాకోబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

జగ్గంపేట: మండలంలోని గొల్లలగుంటలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ నాగేశ్వరరావు రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కలిగే లాభాలను వివరించారు. పత్తిసాగు చేసిన రైతులు గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వరి సాగు చేసిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పొలం గట్లపై వంగ, మిర్చి, బంతి, మొక్కజొన్న, బొబ్బర, జొన్న, కంది, గోంగూర వంటి పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన సాగు.. బహు బాగు

- మెట్టలో పెరుగుతున్న తోటల పెంపకం
- రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- రాయితీపై పరికరాల అందజేత
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

పెద్దాపురం: ఉద్యాన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో తక్కువ నీటి వనరులతో లాభదాయకంగా ఉన్న బిందు, తుంపర సేద్యాలను అవలంబిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో వీటి ఏర్పాటుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా 50 నుంచి 90 శాతం వరకూ రాయితీలు అందిస్తోంది. దీంతో మెట్ట ప్రాంత రైతులు బిందు, తుంపర సేద్యాలపై మొగ్గు చూపుతున్నారు.

బిందుసేద్యంతో..

మెట్టలో ప్రధానంగా మామిడి, జీడీమామిడి, కొబ్బరి, జామ, పామాయిల్, సపోటా అరటి తోటల సాగుకు బిందు సేద్యం అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు బిందు సేద్యం యూనిట్లను ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై అందజేస్తోంది. బిందుసేద్యం ద్వారా చెట్టు తల్లి వేరుకు అవసరమైన నీటిని అందిస్తారు. ఈ నీటిని వృథా కాకుండా తక్కువ నీటితో అధిక దిగబడి సాధించవచ్చు.

రాయితీపై పరికరాలు– అర్హతలు

ఐదెకరాల లోపు ఉన్న అన్ని కులాల రైతులకు 90 శాతం రాయితీపై ప్రభుత్వం డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తోంది. రైతు పది శాతం వాటాను భరించాలి. ఐదెకరాల కంటే పైబడిన రైతులకు 50 శాతం రాయితీ వర్తిస్తుంది. రైతు మిగిలిన శాతాన్ని భరించాల్సి ఉంటుంది. యూనిట్ విలువను బిందుసేద్యం పైపుల సంఖ్య, వ్యవసాయ క్షేత్రంలో బోరు ఉన్న ప్రదేశం ఆధారంగా ఫీల్డ్ అధికారి నిర్ణయిస్తారు. ఈ యూనిట్ కావాల్సిన రైతుల పొలంలో కచ్చితంగా వ్యవసాయ బోరు ఉండాలి. భూ యజమాని ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, 1బీ ఫారం, ఎఫ్ఎంబీ ఫారం, ఫోన్ నెంబర్ వివరాలతో సచివాలయంలో ఉద్యాన శాఖ సహాయకులను సంప్రదించాలి.

తుంపర సేద్యంతో పువ్వుల సాగు

మెట్ట ప్రాంతంలోని గ్రామీణ ప్రాంత రైతులు కొద్దిపాటి విస్తీర్ణంలో పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు, పువ్వుల సాగు చేస్తుంటారు. ఈ సాగుకు తుంపర సేద్యం ఎంతో అనుకూలంగా ఉంటుంది. చిన్న రైతులు వేసే బంతి, చామంతి, గులాబీ తదితర పువ్వుల సాగుతో పాటు తోటకూర, కొత్తిమీర, బెండ, వంగ, బీర, టమాటా, ఆనభకాయ వంటి కూరగాయల సాగుకు తుంపర సేద్యం అనుకూలమని జిల్లా అధికారులు చెబుతున్నారు. దీనికి గాను ప్రభుత్వం ఐదెకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 55 శాతం రాయితీపై తుంపర సేద్యం యూనిట్లను అందజేస్తోంది. ఐదెకరాల కంటే పైబడిన రైతులకు 45 శాతం రాయితీ అందిస్తోంది.



బిందు సేద్యం యూనిట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

రాయితీ కల్పించడంతో..



నాకున్న మూడెకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నాను. బిందు సేద్యం యూనిట్ ధర రూ.1,02,803 కాగా రాయితీ రూ.50,412 వచ్చింది. నా రైతు వాటాగా రూ.58,559 చెల్లించాను. బిందు సేద్యం యూనిట్, పైపులైన్ ఏర్పాటు చేశారు. గతంలో బోరు సాయంతో సాగు చేసేవాడిని ఇప్పుడు బిందుసేద్యంతో పామాయిల్ చెట్లకు నీరు సమృద్ధిగా అందుతోంది.

– బొడ్డు శ్రీనివాస్, పామాయిల్ సాగు రైతు, ఆర్‌బీపట్నం పెద్దాపురం మండలం

మెట్ట రైతుకు ఎంతో మేలు



మండలంలోని మెట్ట ప్రాంతమైన ఆర్‌బీకొత్తూరు, ఆర్‌బిపట్నం, చిన బ్రహ్మదేవం, వాలుతిమ్మాపురం, ఆనూరు, కొండపల్లి, కట్టమూరు, జె.తిమ్మాపురం గ్రామాల రైతులకు బిందు,తుంపర సేద్యంతో ఎంతో మేలు చేకూరుతోంది. ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో రైతులు ఈ పద్ధితే అవలంబిస్తున్నారు. అయా గ్రామాల్లో బిందు, తుంపర సేద్యంకు దాదాపుగా 130 మంది రైతులు రాయితీపై యూనిట్లు పొందారు. ఆసక్తి ఉన్న రైతులు ఆర్‌బీకేల్లో వీహెచ్‌లను సంప్రదిస్తే మరిన్ని యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

– మాదబోయిన చిలకమ్మ, వీహెచ్ఏ, రాయభూపాలపట్నం, పెద్దాపురం మండలం